సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



రేషన్‌తో గోధుమపిండి

ఈ నెల రేషన్‌లో గోధుమ పిండి కూడా ఇవ్వనున్నారు. ఆ మేరకు ఏర్పాట్లు చేశారు.

- 8లో



పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

శ్రీకాకుళం, దన్నానపేట పాలిటెక్నిక్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆ వివరాలు వెల్లడించారు.

- 8లో

సోమవారం స్పందన రద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు తెలిపారు. అక్టోబర్ 2 సెలవు దినం సందర్భంగా స్పందన నిర్వహించడం లేదని ఆయన పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని, ప్రయాస పడి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా నేడు స్వచ్ఛతా హీ సేవ



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వచ్ఛతా హీ సేవ-2023, స్వచ్ఛతా శ్రమదాన్ పేరుతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. జిల్లాలో శ్రమదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయని రాజకీయ ప్రముఖులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వామ్యం అవుతారని శనివారం తెలిపారు. వారితో పాటు జిల్లాలోని యువతీ, యువకులు, సాధారణ ప్రజానీకం, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని విన్నవించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల వేదికగా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాల ఫొటోలను ప్రజలు http:swachhataseva.com పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చని సూచించారు. ఉత్తమ సేవకులకు స్థానిక సర్పంచి, కార్యదర్శుల ద్వారా ప్రశంసాపత్రాలు అందుతాయని వివరించారు.

అక్టోబర్ 2న కోర్టులో..

మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛ హీ సేవా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పి.రాము తెలిపారు. ఉదయం 8.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాద గుమస్తాలు హాజరు కావాలని కోరారు. అలాగే అదే రోజు గాంధీ జయంతి కార్యక్రమాన్ని కూడా బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహిస్తామన్నారు.

'ఆడ, మగ భేదం ఉండకూడదు'



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో ఆడ, మగ అనే లింగ భేదం ఉండరాదని రెవెన్యూ డివిజనల్ అధికారి బి.శాంతి అన్నారు. శ్రీకాకుళం ఆర్డీఓ చాంబర్ లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టంపై శనివారం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు ఆదిత్యుని మూలవిరాట్టుపై కిరణ స్పర్శ



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి సన్నిధిలో ఆదివారం గర్భాలయంలో ఉన్న మూలవిరాట్టుపై తొలి సూర్యకిరణాలు తాకనున్నాయి. ఆదివారం వేకువజామున 6 గంటల సమయంలో సూర్యోదయ తొలి కిరణాలు నేరుగా స్వామి సన్నిధిని చేరుకోనున్నాయి. ఈ అద్భుత క్షణాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు అరసవల్లి క్షేత్రానికి తరలిరానున్నారు. ఈ మేరకు ఆలయ ధ్వజస్తంభం నుంచి సూర్యకిరణ స్పర్శను చూసేలా ప్రత్యేక బారికేడ్లను ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. అయితే ఆకాశం మేఘావృతం అయితే కిరణ దర్శనం కనిపించదని, అలాగే సోమవారం కూడా ఇలాంటి దర్శనానికి భక్తులకు అవకాశం ఇవ్వనున్నట్లుగా వివరించారు.

కొత్త చరితకు శ్రీకారం



టెక్కలి మండలం లింగాలవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందులిచ్చే కౌంటర్ వద్ద రోగులు

- జిల్లాలో ఘనంగా మొదలైన జగనన్న ఆరోగ్య సురక్ష
- తొలిరోజున 30 మండలాల్లో వేలాది మందికి వైద్య పరీక్షలు

అరసవల్లి:

ఊరూరా హోరెత్తేలా వైద్య శిబిరాలు జరిగాయి. మొత్తం 30 మండలాల పరిధిలో ఒకే రోజు వేలాది మందికి డాక్టర్లు నాడి చూసి వైద్యం చేశారు. జ్వరం నుంచి గుండె సమస్యల వరకు, రక్తహీనత నుంచి కిడ్నీ వ్యాధుల వరకు అన్నింటికీ పరీక్షలు చేసి పేదలకు ఊరటనిచ్చారు. మునుపెన్నడూ జరగని రీతిలో, చరిత్ర ఎరుగని తీరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమం జిల్లా చరితలో ఓ సువర్ణాధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకువచ్చిన వైఎస్ జగన్ సర్కారు ఇప్పుడు ప్రివెంటివ్ హెల్త్ కేర్‌లో నూతన అధ్యాయంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' పేరుతో ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అత్యున్నత వైద్యాన్ని అందిస్తోంది. శనివారం జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని 30 మండలాల్లోనూ ప్రారంభమైన ఈ కార్యక్రమం వచ్చేనెల 3వ తేదీ వరకు కొనసాగనుంది.

ఉచిత పరీక్షలు.. ఉచిత మందులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నుంచి జిల్లా వ్యాప్తంగా మొదలైంది. నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం లింగాలవలసలో జరిగిన జిల్లాస్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఎంహెచ్ఓ డాక్టర్ మీనాక్షి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు. ఈ ఒక్క శిబిరానికి రికార్డు స్థాయిలో 4,180 మంది ఎన్‌రోల్ చేసుకోగా.. వీరికి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్, మలేరియా, డెంగీ, కళ్ల తదితర 7 రకాల వైద్య పరీక్షలను నిర్వహించారు. అలాగే పరీక్షల అనంతరం వైఎస్సార్ విలేజి హెల్త్ క్లినిక్‌ల వద్దే ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఆరోగ్య సురక్ష యాప్‌లో వారి వివరాలను నమోదు చేయించి, హెల్త్‌క్యాంపు తేదీ స్థలాలతో కూడిన టోకెన్లను అందజేశారు. ఈ క్యాంపుల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యుల సమక్షంలో వైద్య సేవలందేలా షెడ్యూల్ ప్రిపేర్ చేస్తున్నారు.



హిరమండలం మండలం కొండరాగోలులో మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మొత్తం 5 దశల్లో..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మొత్తం 5 దశల్లో రోగులకు అద్భుత వైద్య సేవలను ఉచితంగా అందించేలా ప్రణాళికను డిజైన్ చేశారు. సీఎం వైఎస్ జగన్ ఆలోచనల్లో భాగంగా సిద్ధమైన ఈ కార్యక్రమంలో తొలిదశగా గత నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించిన వైద్య సిబ్బంది, రెండోదశలో ఉచిత వైద్య పరీక్షలు, టోకెన్ల జారీ, మూడో దశలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్‌క్యాంపుపై స్థానిక ప్రజాప్రతినిధుల ఇంటింటి సందర్శన, నాల్గో దశలో ఆరోగ్య సురక్ష శిబిరాల (హెల్త్ క్యాంపు) ఏర్పాటు, ఐదో దశలో సిఫారసు పొందిన రోగులకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం నిరంతర పర్యవేక్షణ చేయడంతో ఈ కార్యక్రమాన్ని ముగించనున్నారు.

మండలాలు	30
హెల్త్ క్యాంపులు	27
ఓపీ కేసులు	9,165
రిఫరల్	341

9,165 ఓపీ కేసులు..

జిల్లాలో శనివారం మొత్తం 30 మండలాల్లో 27 హెల్త్ క్యాంపులను నిర్వహించగా.. ఓపీ కేసులు 9165 నమోదయ్యాయి. ఇందులో అవసరం మేరకు ఏడు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించగా.. 341 మందికి వారి ఆరోగ్య పరిస్థితి మెరుగు కోసం రిఫరల్ చేస్తూ టోకెన్లు జారీ చేశారు. పలాస నియోజకవర్గంలో నిర్వహించిన పలు ఆరోగ్య సురక్ష శిబిరాల్లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొని నేరుగా రోగులకు పరీక్షలు నిర్వహించారు. నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం లింగాలవలస కార్యక్రమంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పాల్గొనగా, టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం దంత వద్ద కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఇచ్ఛాపురం నియోజకవర్గం కంచిలి మండలం అంపురంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌లు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు, మెళియాపుట్టిలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు.



సోంపేటలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు. చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్



లావేరు మండలం కేశవరాయునిపాలెంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్



కోటబొమ్మాళి: దంత సచివాలయంలో బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్సీ దువ్వాడ



వజ్రపుకొత్తూరు రూరల్: బాతుపురంలో పేర్లు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది



జలుమూరు: లింగాలవలసలో వైద్యశిబిరం ప్రయోజనాలు ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు వివరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం లక్ష్యం

జలుమూరు: సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దీని కోసం ఇటు అధికారులు అటు వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పేదలకు ఖరీదైన మందులు అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. లింగాలవలసలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. 45 రోజుల పాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వైద్య సిబ్బంది, అధికారు లు, వలంటీర్లు సేవలు అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవల సర్వే నిర్వహించిన వారితో పాటు కొత్తగా శిబిరానికి వచ్చిన వారికి కూడా వెంటనే రిజిస్ట్రేషన్ చేసి వెనువెంటనే వైద్యం అందించడంపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సిబ్బందికి సలహాలిచ్చారు. శిబిరానికి వచ్చిన వారికి వంద శాతం వైద్యం అందించాలని, ఈసీజీ ఇతర పరీక్షలు చేయాలని సూచించారు.



జలుమూరు: లింగాలవలసలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

అనంతరం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, రాష్ట్ర నోడల్ అధికారి కె.సుబ్రహ్మణ్య రెడ్డి, స్థానిక వైద్యులు శ్రీకాంత్, చల్ల వంశీకృష్ణ, ప్రత్యేక వైద్యులు మెండ సుధారాణి, ఆర్.కుమార్, ఎంపీపీ వాన గోపి, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, గొలివి గోవిందరావు, పట్ట నూకయ్య తదితరులు ఉన్నారు.



పలాస: అల్లుకోలలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

ఆరగించవయ్యా.. మా మొర ఆలకించవయ్యా



హిరమండలం అంగూరువీధిలోని రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో తిరుప్పావడ సేవ శనివారం వైభవంగా జరిగింది. ఏడు శనివారాల వ్రతం ముగింపు అనంతరం స్వామికి 108 రకాల పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. వీటిని రాసిగా పోసి ఏడు కిలోల పులిహోర, ఏడు కిలోల చక్రపొంగలితో స్వామి రూపంలో అలంకరించారు.

- హిరమండలం

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఉప కార్మిక కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉచితంగా ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా యూఏఎన్ (యూనివర్సల్ అకౌంటు నంబర్) కేటాయిస్తారని, గుర్తింపు కార్డు జనరేట్ చేసి ఇస్తారని వివరించారు. అలాగే ఆహార భద్రత ఉచితంగా కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు మరణించినా, పూర్తి అంగవైకల్యం కలిగిన రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందుతుందని తెలిపారు. దీని కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ పీడీ, డీఆర్‌డిఏ, ఉపకార్మిక కమిషనర్, జిల్లా ఆరోగ్య అధికారి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌తో ఒక జిల్లా స్థాయి కమిటీని ఏర్పరచుకుని దరఖాస్తుల పరిశీలన, అప్ లోడింగ్ ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. వలస కార్మికులకు రేషన్ కార్డు కావాలన్నా, ఇతర సమాచారం కోసం దగ్గరలో ఉన్న కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రధాన మంత్రి శ్రమ యోగి మాన్ ధన్ (పీఎం-ఎస్‌వైఎమ్) పథకంలో చేరితే పెన్షన్ సదుపాయం కూడా వర్తిస్తుందని తెలిపారు. అందువల్ల వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులందరూ దగ్గరలో గ్రామ/ వార్డు సచివాలయాల్లో సిఎస్‌సీ సెంటర్స్ సంప్రదించి ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరును ఉచితంగా నమోదు చేసుకోవాలని కోరారు. దీనికి సచివాలయ ఉద్యోగులు, సీఎస్‌సీ సెంటర్ ప్రతినిధులు కార్మికులకు సహకరించాలని సూచించారు. జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా ఆహార దినుసులు, అలాగే ప్రమాదవశాత్తు మరణిస్తే ఆర్థిక సాయం పొందవచ్చని తెలిపారు.

'జగనన్న కాలనీని సిద్ధం చేయండి'

జలుమూరు: లింగాలవలస, చల్లవానిపేట జగనన్న కాలనీలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ఈ కాలనీలను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన శనివారం అక్కడ సందర్శించి అధికారుల కు పలు సూచనలు చేశారు. కాలనీలో మౌలిక వసతులైన రోడ్లు, తాగునీరు, సింహద్వారం, మొక్కలు, లింక్ రోడ్లు, పెయింటింగ్ తదితరవి ఈ నెల 4 నాటికి పూర్తి చేయాలన్నారు. వీటిని స్ఫూర్తిగా తీసుకుని జిల్లా వ్యాప్తంగా అన్ని కాలనీల నిర్మాణం జరగాలని ఆయన తెలిపారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసి నాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలో (రిమ్స్) యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని మూడో అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి పి.భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, ర్యాగింగ్ పాల్పడితే శిక్షలు తప్పవని తెలిపి యాంటీ ర్యాగింగ్ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు రిమ్స్ కాలేజీ ప్రిన్సిపల్ రవి వెంకటాచలం వైస్ ప్రిన్సిపల్ కె.కోటేశ్వరరావు, న్యాయవాదులు అన్నెపు సత్యనారాయణ గేదెల ఇందిరా ప్రసాద్, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రసన్న పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

క్లుప్తంగా

రగ్బీ పోటీలకు జిల్లా జట్ల పయనం



కర్నూలులో జరగనున్న రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు పయనమైన జిల్లా జట్లు

టెక్కలి: కర్నూలులో ఏపీ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న 9వ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అండర్–18 విభాగంలో బాల బాలికల జిల్లా జట్లు శనివారం పయనమయ్యాయి. ఈ సందర్భంగా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వారణాసి గోవిందరాజు, పొన్నాడ పార్వతీశంతో పాటు ప్రతినిధులు డి.రామకృష్ణ, బి.నారాయణరావు, కేకే రామిరెడ్డి తదితరులు జిల్లా జట్లకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వేణుగోపాలరావు



వేణుగోపాల రావును అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి పప్పల వేణుగోపాలరావు రెండో సారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు శనివారం విజయవాడలోని రెవెన్యూ భవనంలో జరిగాయి. వేణుగోపాలరావు రెండోసారి ఎన్నిక కావడంపై జిల్లాకు చెందిన రెవెన్యూ ఉద్యోగులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు ఆయనను అభినందించారు.

శౌర్యజాగరణ యాత్ర ప్రారంభం



శౌర్యజాగరణ యాత్రలో హనుమకు హారతులిస్తున్న మహిళలు

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్దిలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్యజాగరణ రథయాత్ర శనివారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన మహిళలు పెద్దసంఖ్యలో ఆంజనేయ స్వామికి రథంలో విశేషపూజలు చేసి మంగళ హారతులు సమర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్ నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కాయ భీమసేన్, బల్లెడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

'కేంద్రానిది అరాచక పాలన'



మాట్లాడుతున్న లామ్ తాంతియా కుమారి

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేద్దామని, కేంద్రానిది అరాచక పాలన అని ఆ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు లామ్ తాంతియా కుమా రి అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అధ్యక్షతన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాంతియాకుమారి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. దేశంలో సుస్థిర పాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. ఆ దిశగా రాహుల్ గాంధీని మనమంతా బలపరచి ఆయన నాయకత్వంలో పార్టీని అధికారంలోకి వచ్చేలా కృషిచేద్దామన్నారు. మణిపూర్‌లో మహిళలపై అత్యంత పాశవికంగా దాడి చేసినా కేంద్రం కనీస చర్యలు చేపట్టలేదని గుర్తు చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

రేషన్‌తో గోధుమ పిండి

- ప్రతి కార్డుకీ కిలో చొప్పున పంపిణీకి ఆదేశాలు
- రూ.16కు కిలో గోధుమ పిండి
- రేషన్ వాహనాల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు



నరసన్నపేట సివిల్ సప్లై గిడ్డంగిలో గోధుమ పిండి బస్తాలు

నరసన్నపేట: రేషన్ బియ్యంతో ఈ నెల గోధుమ పిండి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 30 మండలాల్లో 6,69,692 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి కార్డుకు కిలో చొప్పున గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ వాహనాల వద్ద ఫోర్టిఫైడ్ గోధుమ పిండి తీసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇప్పటికే మండల కేంద్రాల్లో ఉన్న పౌర సరఫరాల గిడ్డంగులకు గోధుమ పిండి నిల్వలు గురువారం చేరాయి. వెంటనే వీటిని గ్రామాల్లో ఉన్న డిపోలకు పంపే ఏర్పాట్లు చేశారు. గోధుమ పిండికి వేరుగా వేలిముద్రలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మార్కెట్‌లో కిలో గోధుమ పిండి ధర రూ.40 నుంచి రూ.50 మధ్య ఉంది. అయితే ప్రభుత్వం కేవలం రూ.16కే అందిస్తోంది. ఈ సదుపాయాన్ని కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

కార్డుదారులు వినియోగించుకోవాలి



నరసన్నపేట గిడ్డంగి పరిధిలో ఉన్న పోలాకి, నరసన్నపేట మండలాల్లో 21,265, 23,354 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి గోధుమ పిండి పంపిణీ చేయడానికి వీలుగా 16 మెట్రిక్ టన్నులు వచ్చింది. మరో 4 మెట్రిక్ టన్నులు రావాలి. కార్డుదారులు వినియోగించుకోవాలి.

– డి.రామకృష్ణ, సీఎస్‌డీటీ, నరసన్నపేట

● జెడ్పీ చైర్ పర్సన్ పల్లెనిద్ర



జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ పల్లె ప్రజలతో మమేకమయ్యారు. ప్రభుత్వ పథకాలు వివరించి అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. సోంపేట మండలం ఉప్పలాం పంచాయతీ బట్టిగళ్లూరు గ్రామంలో శనివారం రాత్రి ఆమె వైఎస్సార్ సీపీ ఇచ్ఛాపురం సమన్వయకర్త పిరియా సాయిరాజ్‌తో కలిసి రచ్చబండ, పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలతో ముచ్చటించి అక్కడే నిద్రకు ఉపక్రమించారు. – సోంపేట

జూనియర్ కాలేజీ పరిశీలన



అధ్యాపకుల లెసన్ ప్లాన్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీవీఈఓ కోట ప్రకాశరావు

వజ్రపుకొత్తూరు: ఇంటర్ విద్యార్థులకు పక్కా ప్రణాళికలతో తరగతులు నిర్వహించాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కోట ప్రకాశరావు సూచించారు. మండలంలోని గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధ్యాపకుల టీచింగ్ నోట్స్, డైరీ, లెసన్ ప్లానింగ్, హాజరు పట్టికలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం కళాశాలలో విద్యార్థుల ప్రయోగ శాలలను పరిశీలించారు. తరగతుల తర్వాత 5 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించాలని సూచించారు. ఇంటర్ షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణమూర్తి, అధ్యాపకులు రూపుసుందర్, టి.తిరుపతిరావు, రాంబాబు, గణేష్, అలేఖ్య, శోభారాణి, వాణి, సౌజన్య పాల్గొన్నారు.

సత్తాచాటిన సెంచూరియన్ వర్సిటీ అధ్యాపకుడు



చెక్కు అందుకుంటున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ దాస్

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీలో అగ్రికల్చర్, బయో ఇంజినీరింగ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రత్యూష్ కుమార్ దాస్ సెప్టెంబర్ 27వ తేదీన భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీల్లో సత్తాచాటాడు. వరి పంటలో 'పాలిమెర్ ఫంక్షనైజ్డ్ బయో బెడ్స్ మరియు సారవంతమైన మట్టి సంస్కరణలు (పీబీఈఏ)' పరిశోధనకు గానూ ఆయన బృందానికి తృతీయ బహుమతి లభించినట్లు డీన్ ఎం.దేవేందర్ రెడ్డి తెలియజేశారు. అమె ఒడిశా ముఖ్య కార్యదర్శి అసీత్‌కుమార్ త్రిపాఠి చేతుల మీదుగా డాక్టర్ ప్రత్యూష్ కుమార్ దాస్ బృందం రూ.10 వేలు చెక్కు అందుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడికి సెంచూరియన్ వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, ఎం.ఎస్.స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం డీన్ ఎం.దేవేందర్‌రెడ్డి, డీన్ (అకాడమిక్) డాక్టర్ ఎస్పీ నందా, అసోసియేట్ డీన్ ప్రొ.అనిల్ కుమార్, డైరెక్టర్ (అడ్మిషన్స్) డా.దుర్గాప్రసాద్ పాఢి, ఎం.సుబ్రహ్మణ్యం, డా.పి.కల్యాణ చక్రవర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

'గ్రీన్ ఎనర్జీ వైపు అడుగేద్దాం'



విద్యుత్ వాహనాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేసి విద్యుత్ వాహనాలను వినియోగిద్దామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు అన్నారు. ఈ మేరకు అందరి చేతా ప్రతిజ్ఞ చేయించారు. గో–ఎలక్ట్రిక్, గో– గ్రీన్ నినాదంతో నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నెడ్‌క్యాప్ ఏర్పాటు చేసిన విద్యుత్ వాహనాల ప్రదర్శన, అవగాహన కార్యక్రమాన్ని కమిషనర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలను ఆయన ఆసక్తిగా పరిశీలించారు. నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలపాన త్రినాథ రెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్ వాహనాన్ని నడిపి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా విద్యుత్ వాహనాలను వినియోగించాలని ఓబులేసు ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ కూడా గ్రీన్ ఎనర్జీ వినియోగం పెంచేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరగాలంటే, చార్జింగ్ స్టేషన్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నెడ్‌క్యాప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇంధన వీర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కాలుష్య రహిత ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మన రాష్ట్రంలో సుమారు 1.30 కోట్ల వాహనాలు ఉన్నాయని, వీటిలో అత్యధికంగా ద్విచక్ర వాహనలేనని చెప్పారు. వీటి వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోందని అన్నారు. విద్యుత్ వాడకాల వినియోగం వల్ల పర్యావరణ పరిరక్షణ జరగడమే కాకుండా, రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని అన్నారు. వాహనాల ఖరీదు కంపెనీ, మోడల్ బట్టి రూ.1.30లక్షల నుంచి 1.85 లక్షలు వరకు ఉంటుందన్నారు. ఈ వాహనాలు ఇంటి వద్దనే చార్జింగ్ చేసుకోవచ్చని చెప్పారు. ఒకసారి చార్జింగ్‌కు 4 లేదా 5 గంటలు పడుతుందని, కరెంటు ఖర్చు రూ.20తో 100 కిలోమీటర్లు ప్రయాణించవచ్చని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల వాడుక ద్వారా పొదుపు చేసిన ధనం, రుణ వాయిదాల చెల్లింపునకు సరిపోతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు 'ఈవీఎన్ఆర్ఈడిక్యాప్.ఇన్' పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సునీతా, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గంగు శారద, సీపాన రామారావు పాల్గొన్నారు.

'గ్రామాల్లో స్వపరిపాలన'



వైఎస్సార్ క్లినిక్ భవనం ప్రారంభోత్సవంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల్లో స్వపరిపాలన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. అజ్జరాం గ్రామంలో శనివారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌తో కలిపి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ. 21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ. 17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. సిమెంట్ రోడ్లు, జలజీవన్ మిషన్ ఇంటింటి కుళాయిలను కూడా ప్రారంభించారు. ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు మండల, జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల పంపిణీ, వ్యవసాయ పంటలు మద్దతు ధరలకు కొనుగోళ్లు జరుగుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, నాయకులు బెండు రామారావు, మాడుగుల మురళీధర్‌బాబా, బోర సాయిరాం రెడ్డి, సర్పంచ్ సుగ్గ శ్రతంతి, ఎంపీటీసీ బోరగోవింద రెడ్డి, అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సూర్యనారాయణ, పీఆర్ డీఈ సీతంనాయుడు, హౌసింగ్ ఏఈ రాజేంద్రప్రసాద్, ఏవో సురేష్, పీఆర్‌జేఈ సూర్యచంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ దివ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం కమిటీ నియామకం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ జిల్లా డాక్టర్ల విభాగం కమిటీని నియమించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పేరు – హోదా	నియోజకవర్గం	మజ్జి హేమరాజు	పలాస
చింతాడ వరుణ్, అధ్యక్షులు	టెక్కలి	జి.బాలకృష్ణ	నరసన్నపేట
ఎస్.కృష్ణరాజా, ఉపాధ్యక్షులు	శ్రీకాకుళం	ముద్దాడ గోపి	నరసన్నపేట
ముద్దాడ భూపాలనాయుడు, ఉపాధ్యక్షులు	నరసన్నపేట	కరవంజ కూర్మారావు	నరసన్నపేట
		కల్ల సింహాచలం	నరసన్నపేట
ప్రధాన కార్యదర్శులు		తాలాభత్తుల రత్నాకరరావు	పాతపట్నం
డి.సుధీర్	శ్రీకాకుళం	పెదకోట రాము	పాతపట్నం
అంధవరపు రవి	శ్రీకాకుళం	సంయుక్త కార్యదర్శులు	
ఇలపండ శ్రీధర్	పాతపట్నం	కొమ్మాన సుందరావు	పాతపట్నం
జగబందు డోలి	ఇచ్ఛాపురం	తాడేల బాబురావు	పాతపట్నం
ధన్వంతరి రాలో	ఇచ్ఛాపురం	చీకటి ఎర్రయ్య	ఎచ్చెర్ల
పి.తాతయ్యలు	ఆమదాలవలస	గుండ రవి	ఎచ్చెర్ల
కె.వేదవ్యాస్	శ్రీకాకుళం	కింజరాపు మల్లేశ్వరరావు	ఎచ్చెర్ల
కార్యదర్శులు		మీసాల రాజు	ఎచ్చెర్ల
జె.రామకృష్ణ	ఎచ్చెర్ల	సీపాన శ్రీను	ఆమదాలవలస
జె.ఎస్ రాజు	టెక్కలి	కిల్లి నాగేశ్వరరావు	ఆమదాలవలస
లఖినాన చలం	టెక్కలి	పందిరి మోహన్	పలాస
బండపల్లి రాకేష్	టెక్కలి	చిన్నాల పాపారావు	ఆమదాలవలస
జి.రామకృష్ణ	టెక్కలి	తమ్మినేని రమణ	ఆమదాలవలస
ధర్మవరపు అప్పారావు	టెక్కలి	మామిడి భాస్కర్	పలాస
పొట్నూరు జోగారావు	టెక్కలి	మద్దిలి పాపారావు	పలాస
శిమ్మ శ్రీనివాసరావు	టెక్కలి	బి.ఎస్ రాజు	ఎచ్చెర్ల
ఎస్.తేజేశ్వరరావు	ఇచ్ఛాపురం	బి.జ్యోతిస్వరూప్	శ్రీకాకుళం

రొయ్యల చెరువులపై విచారణ



ఆక్వా, వ్యవసాయ రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ, మత్స్యశాఖాధికారులు

ఇచ్ఛాపురం రూరల్: పెద్ద లక్ష్మీపురం గ్రామం వద్ద అక్రమంగా రొయ్యల చెరువులు ఏర్పాటు చేయడం వల్ల వ్యవసాయ, ఉద్యానవన పంటలు నాశనం అవుతున్నాయంటూ ఇటీవల 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో చేసిన ఫిర్యాదుకు జిల్లా అధికారులు స్పందించారు. శనివారం వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పీవీ శ్రీనివాసరావులు రొయ్యల చెరువులు, వ్యవసాయ పంట పొలాలను పరిశీలించారు. అనంతరం ఆక్వా, వ్యవసాయ రైతులతో విడివిడిగా మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు విలేకరులతో మాట్లాడుతూ ఇరు వర్గాల వారి అభిప్రాయాలను తీసుకుని తయారు చేసిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆక్వా, వ్యవసాయ రైతులు అప్పటి వరకు సమన్వయంతో ఉండాలని సూచించారు. తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నరసింహమూర్తి, మత్స్యశాఖ ఏడీ సత్యనారాయణ, ఎఫ్‌డీఓ రవికుమార్, వీఎఫ్ఏ ముబిన్ అబ్దుల్లా, వీఆర్వోసంతోష్, వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి, బుడ్డ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

'స్పాట్ అడ్మిషన్లు సద్వినియోగం చేసుకోవాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోఈ నెల 3వ తేదీన నిర్వహించే స్పాట్ అడ్మిషన్లు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ గురుగుబెల్లి దామోదర్‌రావు చెప్పారు. కళాశాలలో సీట్ల వివరాలను శనివారం వెల్లడించారు. సివిల్ బ్రాంచ్‌లో ఎస్సీ మహిళా విభాగంలో ఒకటి, ఈడబ్ల్యూఎస్‌లో ఆరు, ట్రిపుల్‌ఈలో మహిళలు అన్ రిజర్వ్‌డ్ ఒకటి, బీసీబీ ఒకటి, ఈడబ్ల్యూఎస్ 3, మెకానికల్‌లో ఈడబ్ల్యూఎస్‌లో 4, సీసీపీలో ఈడబ్ల్యూఎస్ 3, ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో 22 ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వచ్చిన దరఖాస్తుల్లో మెరిట్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. స్పాట్ అడ్మిషన్లకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవని అన్నారు. సాంకేతిక విద్యా శాఖ నిబంధనల మేరకు పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

పాలిటెక్నిక్‌లో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఆమదాలవలస రూరల్: మండలంలో దన్నానపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మంగళవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో గల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌ల్లో మిగిలిపోయిన సీట్లు భర్తీ చేయడానికి స్పాట్ అడ్మిషన్లు కోరుతున్నట్లు చెప్పారు. ఈ అడ్మిషన్లు పొందే విద్యార్థులు నిర్ణీత ఫీజులు చెల్లించాల్సి ఉంటుందని, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు వర్తించవని తెలిపారు.